అసంపూర్ణ చిత్రం

—కె.వి. నరేందర్

వర్షంపడి వెలిసింది....

పెరట్లోని ఎర్ర తురాయి చెట్టుమీది పూలన్నీ రాలి భూమ్మీద పరుచుకున్నాయి..... రక్తసిక్తమైన యుద్ధక్షేత్రంలా ఆ పూలతో ఎర్రగా ఉందా ప్రదేశం.

నాకా పూలంటే చాలా ఇష్టం!

ఆ ఇష్టం ఏర్పడడానికి కారణం....ప్రమద!! ఆ చెట్టుకిందికి నడుస్తుంటే మట్టివాసనేసింది. ఇప్పుడిప్పుడే సూరీడు బయటకొస్తుంటే లేత ఎండ కాస్తోంది. తురాయి పూలన్నింటినీ ఏరి అందంగా 'ఆమె' పేరులా అమర్చాను.

ప్రమద.

కుంకుమతో ముగ్గేసినట్టుగా ఉందా పేరు. ఆ పేరుని చూస్తూ అలాగే కూచుండిపోయాను. సిటీలో బోర్ కొట్టిన రెండేళ్లకు మళ్ళీ మావూరు... మా ఇల్లు... పెరట్లో ఎర్రతురాయి చెట్టు.... ప్రమద పరిచయం ఆచెట్టుకిందే.

మొదటిసారి అక్కయ్యవాళ్లింట్లో ప్రమద వాళ్ల కుటుంబం దిగినప్పుడు చూసింది మొదలు... అవే జ్ఞాపకాలు.

ఆరోజు ఇలాగే వర్షం పడింది. పూలన్నింటినీ ప్రమద అన్న అక్షరాలుగా అందంగా పేర్చి... మైమరిచి చూస్తున్నాను. ఒక్కసారిగా నామీదే వర్షం కురిస్తే చప్పున లేచి ఇంట్లోకి పరిగెత్తబోయాను. అప్పుడు విన్పించింది. కోయిల గొంతుకు తేనె రాసుకున్నంత తియ్యటినవ్వు.... చెట్టుకొమ్మను వూపుతూ కిలకిలా నవ్వుతోంది ప్రమద. నిజానికి వర్షం పడట్లేదు. ఆమె వూపుతోన్న కొమ్మ ఆకులమీది నీటి బిందువులు జల్లులా రాలిపడుతున్నాయి.

'నా పేరు నీకెలా తెల్సు?' అధికారికంగా అడిగినట్టుందామాట. నిజంగా మొదటిసారి భయపడ్డాను. ఈ విషయం అక్కకి చెపితే. నే మాట్లాడలేదు.

మీ అక్కయ్యకేం చెప్పనుగాని... నువ్వింత మంచి ఆర్టిస్టువని ఈ వారం రోజుల్నుంచీ తెలీదు. నిన్న నువ్వు కాలేజీకెళ్ళాక మీ అక్కయ్య నువ్వేసిన బొమ్మలు చూపించింది. నిజం మునీ...ఇప్పుడు పూలతో పేర్చిన నా పేరుని చూస్తుంటే...'

ఆమె కళ్లల్లో నీళ్ల తిరుగుతున్నాయి. అందమైన ఆమె ముఖం ఆనందంగా వెలిగిపోతుంది. ఆ వెలుగులో ఆ ముఖంలోని ఎరుపుదనానికి ఎర్రతురాయి పువ్వు కూడా సిగ్గుపడుతుందేమో? ఆమె తన ముందు మోకాళ్ళమీద కూచుంది. ఆ పూలను దోసిళ్లలో తీసి...

'అనంతంలోకి తలెత్తి చూడు... ఆకాశం సిగలో ఏడురంగుల దండల్ని తురుముకుంటుంది. చింత చెట్టుమీది కోయిల చిగురు వరకు మత్తుగా పాడుతోంది. మన కలయిక తుషార సమీరంలో వసంతాగమనం కావాలి. మన స్నేహం ఎర్రతురాయి రేఖల్లో ముడుచుకుపడుకున్న ఆర్ద్ర పురుగులా కల్సిపోవాలి....' అంటూ ఆ పూలు నానెత్తిన గుమ్మరించి కుచ్చిళ్లను పైకెత్తి ఇంట్లోకి పరిగెత్తింది.

నేను బిత్తరపోయి అలాగే అదే చెట్టుకింద.... గంట సేపు కూచున్నాను. అక్కయ్య అన్నానికి పిలిచేంత వరకూ.

అలా మొదలైంది ప్రమద పరిచయం. రోజూ అదే చెట్టుకింద కూచునేవాళ్ళం. నాకు దగ్గరగా జరిగి కూచునేది. నేను దూరంగా ఉన్న గుమ్మంవైపు భయంగా చూస్తూనే బాతాఖానీ వేసేవాడిని.

చాలా కబుర్లు చెప్పేది. ప్రకృతిలోని రంగుల గురించి చెప్పేది. నువ్వు రవివర్మ అంతటి గొప్పవాడివి కావాలి అనేది. అతనెవరని నేనడిగితే నవ్వేది.

'మునీ అన్న పేరు నీకు సార్ధకమే' అంది.

'ఎందుకు?' అన్నాను.

'మునీ అని పిలిచినా...బుద్ధా అని పిలిచినా తేడా లేదుకదా' అంది మరింత దగ్గరా జరుగుతూ... నాకేం అర్ధంకాక 'అదేం ఎందుకని' అని అడిగాను.

'ఎన్టీఆర్ విశ్వామిత్ర విడుదలయ్యాక చూడు... ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే ముని కూడా, మేనకొచ్చి పక్కన కూచోగానే రెచ్చిపోతాడట'.

నాకర్ధమైన మరుక్షణం... నరాల్లో ఉత్తుంగ తరంగాలు... బిడియంగా చూసాను.

'అమావాస్య వెళ్లిన మూడోరోజు ఆకాశంలో పొడిచే 'నెలపొడుపు'ని చూసి శుభసూచకంగానీ మొహాన్ని మీ ఇంట్లో లైను కట్టి చూస్తారుకదా' అంది.

'అవునూ' అన్నాను.

'ఈరోజు నెలపొడుపు. నువ్వు కళ్లుమూసుకో... నే చూస్తాను' అంది అధికారికంగా. నా చెక్కిళ్ళు ఆమె చేతుల్లోకి వెళ్లినప్పుడు గబుక్కున కళ్లు తెరిచాను. చిలిపిగా నవ్వుతున్న ఆమె కళ్లు నాకు అత్యంత సన్నిహితంగా.

'మునీ...'

ఇంట్లోంచి అక్కయ్య కేకకు క్షణంలో మాయమయ్యాను అక్కడినుంచి. ఆరోజు రాత్రి నాకు నిద్రలేదు. ఆరాత్రి బ్రష్ తీసుకొని ఆమె బొమ్మగీయాలని ప్రయత్నించాను. సగం గీసానో లేదో...గుండెను పిడికిళ్ల మధ్య ఎవరో పిసికినంత బాధేసింది. కడుపులో పేగులు నులి పెట్టినట్లయింది. కళ్ళు మూతలు పడ్డంత నిద్ర ముంచుకొచ్చింది. ఆ స్థితి ఎందుకు కలిగిందో అర్ధంకాలేదు. ఆ చిత్రం ఇప్పటికీ అసంపూర్ణంగానే వుంది.

మర్నాడు ప్రమద నాగదిలోకొచ్చింది నేరుగా... వస్తూనే.

'ఆటోగ్రాఫ్ ఇవ్వవా?' అంది.

ఆమె చేతిలోని ఆటోగ్రాఫ్ పుస్తకాన్ని తీసుకొని అందులో చక్కని కొటేషన్ రాయడానికి పెన్ తీసాను.

"ఇవ్వవా అన్నాను.... రాయవా అన్లేదు" చిరుకోపంగా అంది.

ఇంకెలా ఇవ్వటం? అయోమయంగా అడిగాను. అప్పుడు చప్పున నా కుడిచేతిని తీసుకొని పెదాలతో గట్టిగా ముద్దెట్టుకుంది. హృదికవాటాలు నిశ్శబ్దాన్ని సంతరించుకున్నాయి. నా పెదవులు చిగురుటాకులా రెపరెపలాడాయి. అర నిమిషం తర్వాత నా చేతిని విడచిపెడుతూ 'ఇలా' అంది.

నాలుగో క్షణాన నాలుగు పెదాల సంగమం....

"నువ్వంటే నాకిష్టం... ఎందుకో తెలీదు" ముద్దముద్దగా అంది. అప్పుడే గిటార్ మ్యూజిక్ విన్పిస్తే తలతిప్పి అటు చూసాం. నా ఫ్రెండ్ రాజేష్ వస్తున్నాడు. వాడు గొప్పగా పాడగలడు. ప్రమదని చూసి గదిబయటే ఆగిపోతే పిల్చాను. ప్రమదకు వాడిని సింగర్‌గా పరిచయం చేయగానే ఉత్సాహంగా ఒక పాట పాడమంది. వాడందుకున్నాడు

"హమే తుమ్ సే ప్యార్ కిత్‌నా..."

వాడు అద్భుతంగా పాడాడు. పాట పూర్తికాగానే ప్రమద వాడిని అభినందనల్లో ముంచేసింది. 'ప్లీజ్ మళ్లీ పాడండి' అంటూ బతిమాలింది. వాడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ప్రమద ప్రవర్తన నాకక్కడే నచ్చలేదు.... మనసుకి చిన్న గాయం తగిలిన బాధ.

వాడు ఈసారి తమిళ గీతం పాడాడు. "చిలువిన ముద్దిన ముక్కలే.... ముక్కలే..." అది తనకర్ధంకాలేదని మరో తెలుగుపాట పాడించుకుంది. ఆ గదిలో మూడో వ్యక్తిని నేనున్నట్టే వాళ్లు మర్చిపోయారు.

రాజేష్ వెళ్తుంటే వాడితో మాట్లాడుతూ ప్రమదకూడా వెళ్లింది. వెళ్తూ వెళ్తూ కనీసం నావైపుకూడా చూళ్ళేదు. నామనసు చివుక్కుమంది.

చాలా సేపు మౌనంగా కూచున్నాను. ఆ అసంపూర్ణ చిత్రాన్ని పూర్తి చెయ్యాలనుకున్నాను. వూహూ... అస్సలు సాధ్యపడలేదు.

తర్వాత మూడురోజులు ప్రమద నా గదివైపు రాలేదు. రాజేష్ హోటల్లో కలిసాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. టీ సిప్ చేస్తూ "నేనా అమ్మాయిని ఇష్టపడుతున్నాన్రా" అన్నాడు. చెంప మీద చాచికొట్టాలన్పించింది. నా దగ్గర అంత ధైర్యం లేదని నాకు తెలుసు.

బాధపడ్డాను... ఆరోజంతా!

నాలుగో రోజు ప్రమద నాగదికొచ్చింది.

బావున్నారా? గొంతులో అదే మాధుర్యం.

బావ లేరు... ఆఫీసుకెళ్లారు. కోపంగానే అన్నట్టున్నాను.

పర్లేదు. నువ్వుకూడా జోకులేస్తావే? నువ్వు బాగున్నావా అని అడుగుతున్నాను. ఏయ్.... నా మీద కోపమొచ్చిందా? చాలా ప్రేమగా అడిగింది.

నా కనురెప్పలు గనుక పైకెత్తితే కన్నీట తెరలమీద ఆమె ప్రతిబింబాన్ని చూసుకునేదేమో.... నేను చాలా జాగ్రత్తపడ్డాను.

"నువ్వీ మధ్య బొమ్మలు వేయట్లేదు కదూ. బొమ్మలు వేయకపోతే నీతో ఫ్రెండ్‌షిప్ కట్ చేస్తాను. చిరుకోపంతో నా చుబుకాన్ని పైకెత్తి అంది. అప్పటికప్పుడు విశ్వప్రపంచాన్ని ఆ కుంచెలో కుదించాలన్న కుతూహలం కలిగింది.

తప్పకుండా గీస్తాను. అన్నాను. ఆమెమీద కోపం ఎగిరిపోయింది. అన్నట్టు నీకో విషయం తెల్సా... సుధాకర్‌గారని గొప్పరచయిత. ఆయన ఈ వూర్లోనే ఉంటున్నారు. నిన్న కళాభారతిలో అనుకోకుండా పరిచయం అయ్యారు. ఎంత బాగా మాట్లాడాడో తెల్సా. ఆయన కథలు గొప్పగా వుంటాయి. ఆయన రాసిన నవలల్లో 'నువ్వంటే ప్రాణం' ఎంత బావుందో? నిన్న ఆయనింటికి రమ్మన్నారు. వెళ్లానుకూడా. ఓ సీరియల్‌కు వేస్తున్న ముఖాముఖిలో నా పేరుమీద ఆయనే ప్రశ్న రాసి జవాబు కూడా రాసుకున్నారు. ఇప్పుడు రాయబోయే నవల్లో ఒకపాత్రకు మంచి పేరు పెట్టాలని రెండు రాత్రుల్నుంచి నిద్రలేకుండా ఆలోచిస్తున్నారట. నా పేరు బావుందని నా పేరు పెడుతున్నారు ఆ పాత్రకి. పాపం ఇంత చిన్నవయసులోనే ఆయనగారి భార్య చనిపోతే మళ్లీ పెళ్లికూడా చేస్కోలేదట.

ప్రమద చెప్పుకుంటూ పోతూనే ఉంది. ప్రమద మనస్తత్వమే నాకర్ధం కాలేదు. నేను మౌనంగా ఉండిపోయాను. అసలు తప్పంతా ఎక్కడ ఉంది?

కొంచెం ప్రేమగా..... కొంత ఆలంబనగా... కొండంత ప్రోత్సాహకంగా మాట్లాడగానే ఏవో ఊహించుకుంటోన్న నాలో. రాజేష్‌లోనే వుందా? మర్నాడు నేనూ, రాజేష్ జగిత్యాల పాత బస్టాండ్‌లోంచి వెళ్తున్నాం. రాజేష్ ఈ మధ్య నిరుత్సాహంగా వుండటం నేను అబ్జర్వ్ చేసాను. ప్రమద నన్నూ, వాడిని కలువక వారం దాటివుంటుంది. నాలో నాకే నవ్వొచ్చింది. సరిగ్గా అప్పుడే మా పక్కనించి ప్రమద వెళ్లింది. ఆమె పక్కన రచయిత సుధాకర్! వాళ్లేదో సబ్జెక్టు గురించి చర్చించుకుంటూ వెళ్తున్నారు. ప్రమద నన్ను చూసినా చూడనట్టే దాటుకుంటూ వెళ్లింది. అది నేను గమనించాను.

గుండె కండరాల్ని ఆమె కొనగోటితో చిదిపినంత బాధ కలిగింది. వాళ్లు దూరంకాగానే రాజేష్ ఏదో తిట్టాడు. ఇంటికి వెళ్లిన నాకు జె.ఎన్.టి.యు హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కోర్సులో సీటొచ్చినట్టు లెటరుంది.

'య్యాహూ' అని అరిచాను. ఇల్లంతా గంతులేసాను. ఆనందం పట్టలేక అదిపట్టుకొని ప్రమద దగ్గరకు పరిగెత్తాను.

పరుగు... పరుగు.... పరుగు...

రొగరుస్తూనే చెప్పాను. ప్రమదా నాకు ఫైన్ ఆర్ట్స్‌లో సీటొచ్చింది. అప్పుడామెకెదురుగా రైటర్ సుధాకర్ కూచొని వున్నాడు. ఆయన కాస్తచిరాగ్గా మొహం పెట్టాడు. ప్రమద నన్ను అభినందిస్తుందని చూసాను.

"అచ్ఛా" అంది చాలా నిర్లిప్తంగా.

ఎగిసిపడుతున్న నా ఛాతీలోంచి కన్నీళ్లు విసిరేయబడుతున్నాయేమో... రెప్పలమాటునే వాటిని అణిచి పెట్టి ఈరోజు వెళుతున్నాను ప్రమదా అన్నాను గాబరాతో.

పెదాలు కొంచెం బిగపట్టి కళ్లు నిశ్శబ్దంగా పైకెత్తి ఏకాంతిలేని చూపుల్తో అలాగా... వెళ్ళు. అంది. అతి మామూలుగా. ఆ మాట కన్నా కొరడాదెబ్బ నయమేమో?

నేను వెనక్కి తిరిగాను. అన్ని రంగుల్ని ఎరుసగా పెట్టి జీవితాన్ని ఇంద్రధనుస్సులా పరుస్తుందనుకున్న ఆమె... అన్ని రంగుల్ని కలగలిపి నల్లరంగులా తయారుచేసిన ఆమె పట్ల బాధ, కోపం కలిగాయి. మనసు కుంచెలో ఆమె బొమ్మను చెరిపేస్తూ కదిలాను.

హైదరాబాద్ బస్సెక్కాను. అయినా కళ్ళు ఎవ్వరికోసమో వెతుకుతాయి.

(మిగతా 14వ పేజీలో)

వింతవింత లోకంలో

మంత్రవాది కామాక్షి

'శత్రు' ప్రియత్వం!

ఢిల్లీలో రాజకీయం నడపగం ప్రస్తుత బాంబే స్టార్ ఎవరంటే గానీ, శత్రుఘ్న సిన్హానే గుర్తు కొస్తాడు. ఇది నిజం కూడానట. శత్రు దేవీలాల్ మంచే కాదు విపిసింగ్ దగ్గర నుండి కూడా గౌరవాన్ని పొందగలడట.

అంతవరకూ ఎందుకు, కాంగ్రెస్ నాయకుల మీద కక్ష సాధింపు చర్యలు తీసుకోవద్దని అందరికంటే ముందుగా విపికి, సలహా ఇచ్చింది కూడా శత్రువేనట. ఆ తర్వాతనే జ్యోతిబసు, అరుణ్ నెహ్రూ విపికి ఆ సలహా ఇచ్చారు.

ఎన్నికల ప్రచారంలో విపికి దగ్గరైన శత్రు ఈ సలహాతో కాంగ్రెస్‌కు సన్నిహితుడయ్యాడట. అందుకే లలిత సూరీ హాలిడే ఇన్‌లో ఉచిత రాజభోగాలు శత్రుకోసం స్వాగతం పలుకుతూ ఉంటాయి. లండన్‌లో హిందూజాలు 'ఆతిథ్యమర్యం'తో ఆదరించింది కూడా అందుకేనట. అంతేకాదు. కాంగ్రెస్ నాయకులను ఎవర్నంటే వారిని 'ఫోను' లైన్లో వెలపెట్టగలడట శత్రు. రెండు వైపులా పదునంటే ఇదేనేమో మరి!

ఈ వారం కథ

(12వ పేజీ తరువాయి)

ఆ బాధ చాలా దుర్భరమైంది. బస్సుకదిలింది. ప్రయాణంలో గదిలోగీసిన అసంపూర్ణ చిత్రమే గుర్తొస్తుంది. కాలం వెలిసి పోతూనే ఉంది. ఫైన్ ఆర్ట్స్ కోర్సుకు వెళ్లిన నేను రెండేళ్లయినా తిరిగి జగిత్యాల రాలేదు. ప్రమద ఆలోచనలు మొదట్లో వుండేవి. కాలంతో పాటు అణగారిపోయాయి. ప్రస్తుతం ఒక వీక్లీలో ఆర్టిస్ట్‌గా పార్ట్‌టైం ఉద్యోగం సంపాదించుకున్నాను.

ఓరోజు మా వీక్లీకి రైటర్ సుధాకర్ వచ్చాడు. అతడు రాగానే మా ఎడిటర్ ఓ ఫైలు అతడి ముందుంచుతూ...

సారీ సుధాకర్‌గారు.... కళా హృదయమున్న ఒకమ్మాయి ఎప్పుడు ఏ కళలపట్ల ఆకర్షితురాలై ఆ కళాకారుల్ని అభిమానించినట్టు, ప్రేమించినట్టు నటించి.... చిప్పురేపినా... అలాంటి ఆడవాళ్ల మనస్తత్వాన్ని రకరకాలుగా అంచనా వేస్తూ రాయటం బాగానే ఉంది కాని.. మీరు బుచ్చిబాబు, మెరుపుల మరక, తల్లావఝల మందారం, వెన్నెల మరక, చదవలేదా జస్ట్ ఇలాంటివే. ఇదిగాక క్రొత్త సబ్జెక్ట్ ఏదైనా ట్రై చెయ్యండి అన్నాడు ఎడిటర్. కాని ఇది నాలైఫ్ సార్. ఈ నవల రాయడానికి ఓ అమ్మాయి కారణం, చెప్పాడు సుధాకర్ గొంతు గాద్గికంగా చేసి

"ఎవరా అమ్మాయి?"

"ప్రమద"

వాళ్ల మాటలు వింటున్న నేను ఉలిక్కిపడ్డాను. ప్రమద! ప్రమద!! ప్రమద!!! నా కళ్లల్లో ఎర్రతురాయి చెట్టు కదలాడింది.

"ఇన్‌స్పిరేషన్ ఎవరైనా కావచ్చు. కాని ప్రస్తుతం ఇలాంటివి సీరియల్‌గా పనికిరావు" అన్నాడు ఎడిటర్ నిష్కర్షగా.

సుధాకర్ ఫైల్ తీసుకొని వెనుదిరిగిపోతుంటే... 'సార్' అని పిలిచాను. 'ఏమిటన్నట్టు'గా ఆగిపోయాడాయన.

'ప్రమద ఇప్పుడెక్కడుంది?'

నాలోని ఉత్సుకతకి ఆయన కొంచెం ఆశ్చర్యంగా చూసాడు. ఆ తర్వాత కళ్లల్లో కసి నింపుకొని...

"ఓ బిజినెస్ మాగ్నెట్‌ను బుట్టలో వేసుకొని.... పెళ్లయ్యాక అమెరికా వెళ్లిపోయింది.' అనేసి గబగబా వెళ్లిపోయాడాయన.

నేను స్టన్ అయ్యాను. ఆలోచనల్లో పడి... ఓ కథకు బొమ్మవేసేటప్పుడు అందులో ప్రమదను దించాలని ఎంత ప్రయత్నించినా... అదీ అసంపూర్ణ చిత్రంగానే మిగిలిపోయింది.

అందుకే ప్రమద నాకెప్పుడూ ప్రశ్నార్థకమే.....

??????

చర్చి నిర్మాణంలో ఆత్మలుచేసినవింతలు!

లండన్‌లో బోర్లీ అనే ప్రాంతంలో 12వ శతాబ్దానికి చెందిన ఒక చర్చిని విశాలమైన భవంతిగా అందంగా పునర్నిర్మించడానికి ఆ చర్చికి చెందిన ఫాదర్ తగు ఆర్థిక సహాయం చేయవలసిందిగా నగరంలో వ్యాపారస్థులకు, ప్రభుత్వోద్యోగులకు విజ్ఞప్తిచేశారు. భక్తులు తమ శక్తికొలదీ చందాలు సమీకరించి అతి పెద్ద మొత్తంలో చర్చి రూపురేఖలు మార్చడానికి సరిపడినంత డబ్బును ఆ చర్చి ఫాదర్‌కు అందజేశారు.



చర్చి ఫాదర్ కొంతమంది నిపుణులతో పాత చర్చిని పూర్తిగా ధ్వంసంచేసి దాని స్థానే విశాలమైన ప్రార్థనా మందిరం, అతి పెద్ద శిలువను నిర్మించడానికి ఏర్పాట్లు మొదలుపెట్టాడు. ఒకరోజు పని ప్రారంభమైంది. కానీ చెక్కలతో నిర్మించిన 12వ శతాబ్దానికి సంబంధించిన ఆ చర్చి కుడివైపు కట్టడాన్ని ముందుగా తొలగించే ప్రయత్నం చేశారు. ఉదయం నుండి శ్రమపడి సాయంత్రానికి ఒకవైపు చర్చి గోడను పూర్తిగా తొలగించగలిగారు. ఈ చర్య జరుగుతున్న సందర్భంలో ఆ చర్చి ఫాదర్ పక్క ఊరు వెళ్ళాడు. అర్ధరాత్రి అతను తిరిగి బోర్లే వస్తూ చర్చి పని ఎంతవరకు వచ్చిందో చూద్దామని చర్చిముందు ఆగాడు. చర్చిలో ఏవో కాంతులు లీలగా కన్పడుతున్నాయి. పథకం ప్రకారం చర్చి కుడివైపు గోడ తొలగించాల్సింది. కాని అలాంటి ప్రయత్నమేమీ పనివారు చేసినట్లు ఎలాంటి ఆచూకీ లేదు. క్రీస్తు జన్మదినోత్సవం నాటికి చర్చి నిర్మాణం పూర్తిచేయాలనుకుంటున్న అతడికి సహకరించని పనివారిపై ఆగ్రహం కలిగింది.

మరునాడు పనివారిని పిలిచి గతరోజు పనిచేయనందుకు వారిని మందలించాడు. చర్చి ఫాదర్ మాటలపై విశ్వాసం లేక పనివారు చర్చి వద్దకు వెళ్ళి చూశారు. అంతక్రితం తాము తొలగించిన చర్చి కుడివైపు గోడ చెక్కుచెదరకుండా తిరిగి పూర్వం మాదిరే యథాస్థానంలో ఉండడంతో వారికి ఆశ్చర్యం కలిగింది: రోజంతా శ్రమపడి తొలగించిన గోడ యథాతథంగా వుండడం — మానవమాత్రులెవరూ అంత తక్కువ సమయంలో ఆ పని చేయ్యలేరు. చప్పుడు [illegible] వినిపించేవారికి తెలియకుండా చర్చి [illegible] ఒక రాత్రే యథావిధిగా పూర్వస్థితిలో ఉండడం సామాన్యులతోబాటు చర్చి ఫాదర్‌ను కూడా ఆలోచనలో ముంచేసింది. సహజంగా దెయ్యం, భూతం, ఆత్మలాంటి వాటివలన నష్టమేకాని లాభం ఉండదు. పైగా అవి భయపెడతాయి అన్నే అందరి ఆలోచన. కాని ఒక్కోసారి అవి ఆక్రమించుకున్న స్థలంలో ఎలాంటి కట్టడాలు నిర్మించాలని ప్రయత్నం చేసినా అవి ఎదురుతిరిగి తమ శక్తికొలదీ ఆయా కార్యక్రమాలకు అవరోధాలు కల్పిస్తాయని చర్చి ఫాదర్ తెలుసుకున్నాడు.



ప్రతిరోజూ ఆ చర్చి పని ఇదేవిధంగా సాగుతోంది. పనివారి సహనం నశించిపోతోంది. చివరకు చర్చి ఫాదర్‌కు తమ గోడు చెప్పుకుని ఇకపై చర్చి నిర్మాణం తమవల్లకాదని చెప్పి వెళ్ళిపోయారు. చర్చి ఫాదర్ సందిగ్ధంలో పడ్డాడు. మరో పనివారి బృందాన్ని తెచ్చి పని తిరిగి ప్రారంభించాడు. కానీ పరిస్థితి షరా మామూలే. ఎన్నిసార్లు ఏ పని చేసినా మరుసటిరోజుకి ఆ పని తిరిగి చేయవలసి వచ్చేది. ఒకే పని కొన్నివందల సార్లు చేసినా ఎలాంటి మార్పు రావటంలేదు. ఈ విషయం క్రమక్రమంగా ప్రజలకు తెలిసి గొప్ప సంచలనం సృష్టించింది. చర్చి ఫాదర్ స్వయంగా అక్కడ ఉండి పనిచేయించినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు.

ఈవార్త ఆనోటా ఈనోటా పాకి 'గిఫరీ క్రోవ్' అనే హార్లోకి చెందిన ఒక ఫిజికల్ రీసెర్చి బృంద నాయకునికి తెలిసింది. అతడు బోర్లీకి వచ్చి చర్చి మిస్టరీ గురించి ప్రపంచానికి తెలియజేయాలని చర్చి ఫాదర్‌ను కలిశాడు. చర్చి ఫాదర్ అనవసరపు ఉపోద్ఘాతాలు ఏంలేకుండా జరిగింది జరిగినట్లు అతనికి చెప్పాడు. గిఫరీ తన బృందంతోసహా ఆత్మలను పసిగట్టే రకరకాల యంత్రాలు, ఆటోమేటిక్ కెమేరాలు, చిన్న శబ్దాలను సైతం రికార్డు చేయగల శక్తివంతమైన టేప్ రికార్డర్లను, ఎలాంటి ఆకారాన్నైనా ఫొటోలు తీయగలిగే అత్యాధునిక కెమేరాలతోను ఆ చర్చిలో ప్రవేశించి రాత్రి తెల్లవార్లు అక్కడే గడిపాడు. అతను, అతని బృందం మొదటిరోజు ఎలాంటి శబ్దాలుగానీ, దృశ్యాలుగానీ చూడలేదు. బహుశా దానిక్కారణం ఆరోజు పనివారు రాకపోవటం, చర్చి గోడలు తొలగించకపోవడం కావచ్చునని భావించారు. మరుసటిరోజు పనివారిచేత చర్చిలోపల కొన్ని పాత పటాలను అనవసర సామగ్రిని తొలగింపజేశారు. ఆరోజు కూడా ఎలాంటి ప్రతిబంధకం ఎదురవలేదు. బహుశా చర్చి నిర్మాణంలో అనవసరమైనవి తొలగించినంత మాత్రాన ఆత్మలకు ఎలాంటి అభ్యంతరంలేనట్లు భాష్యం చెబుతున్నారు. మూడవరోజు చర్చి పైకప్పు తొలగించారు. ఆ కార్యక్రమానికి చాలా సమయం పట్టింది. ఆరోజు రాత్ర గిఫరీ బృందం అతిజాగ్రత్తగా ఆ ప్రాంతాన్ని వివిధ కోణాల నుండి పరిశీలిస్తోంది.

అర్ధరాత్రి దాటిన తరువాత క్రమంగా ఏవో అడుగుల శబ్దం వినిపించసాగింది. గిఫరీ బృందం వేయికళ్ళతో ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తోంది. బయటి నుండి ఒక వ్యక్తి కూడా రాలేదు. అలాంటిది మొదటగా ఒక మనిషి పాదాల చప్పుడు, క్రమంగా ఆ సంఖ్య పెరిగి అసంఖ్యాక పాదాల చప్పుడు వినిపించసాగింది. గిఫరీ బృందంలో ప్రతి ఒక్కరూ తమ వద్దవున్న పరికరాలకు పనికల్పించారు. చెదురుమదురు [illegible] వాతావరణం, గాలిలో మార్పు [illegible] అడుగుల చప్పుడు చర్చి [illegible] క్షణాలమీద ఆరోజు తొల[illegible] భాగం తిరిగి యథాస్థితిలో నిర్మించిన తరువాత మరల అడుగులచప్పుడు తగ్గిపోయింది. చర్చిలోపలి భాగం ఒక్కసారిగా కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది. చీకట్లోనక్కి ఆత్మలను పరిశీలిస్తున్న బృందం ఒక్కసారిగా వచ్చిన వెలుగురేఖల్ని చూసి తట్టుకోలేకపోయారు. ఆ వెలుగుకు తమ కళ్ళు అలవాటుపడి చూసేలోగా వారి చెవులకు కొన్ని బైబిల్ సూక్తులు ఉచ్చారణలోపం లేకుండా స్పష్టంగా వినపడ్డాయి. మరుక్షణం వెలుగు క్రమంగా తగ్గింది. అడుగుల చప్పుళ్ళు దూరమయ్యాయి. తిరిగి చీకటి అలుముకుంది. ఈ సంఘటన సరిగ్గా తెల్లవారు ఝామున మూడు గంటలకు జరిగింది. ఆత్మల ప్రార్థన లీలగా ఆ చుట్టుప్రక్కల వారికి వినిపించిది కూడా. గిఫరీ టేప్ రికార్డరులో బైబిల్ సూక్తులు చక్కగా రికార్డయినాయి.

మరుసటిరోజు ఈ విషయాన్ని చర్చి ఫాదర్‌కు తెలియజేశారు. ఆత్మలు రావడం, ఏసు భక్తిగీతాలు ఆలపించడం, బైబిల్ చదవడం ఇవన్నీ వింతగా అనిపించినా పరిశోధనలు మాత్రం సాక్ష్యాధారాలతో సహా చూపిస్తూవుంటే నమ్మక తప్పలేదు. చర్చి ఫాదర్ గిఫరీతో చర్చలు జరిపాడు. బహుశా ఆత్మలు ఆ చర్చిని తొలగిస్తున్నట్లు భావిస్తున్నాయని నిర్ణయానికి వచ్చారు. గిఫరీ సూచనల మేరకు చర్చి గోడలను తీయకుండా పాత చర్చి చుట్టూ కొత్తగా గోడలు నిర్మించడం ప్రారంభించారు. ఈ దశలో కూడా ఆశ్చర్యకర సంఘటనలు చూడాల్సి వచ్చింది. ఒకరోజు అంతా కష్టపడి కట్టిన దానికి రాత్రికిరాత్రే దానికి రెట్టింపు కట్టడం పనిని ఆత్మలు పూర్తిచేస్తూ పనివారికి సహకరిస్తున్నాయి. కనీసం మూడు నెలలైనా పడుతుందని అంచనా వేసిన ఆ చర్చి 15 రోజుల్లో పూర్తిస్థాయి నిర్మాణం ముగిసింది. చర్చి ఫాదర్ ఆశ్చర్యానికి అవధుల్లేవు. గిఫరీ సూచనలు తాము అనుసరించకపోయుంటే ఆత్మలను ఎదుర్కొంటూ చర్చి నిర్మాణం ప్రారంభ దశలోనే ఆగిపోయుండేది. చర్చి నిర్మాణం పూర్తయిన తరువాత కూడా చర్చి లోపలిభాగం కొంతకాలం పాత చర్చి అవశేషాలనే ఉంచారు.

క్రమక్రమంగా పాత చర్చిలోపలి భాగం తొలగించివేశారు. ఈ పని జరుగుతున్నప్పుడు ఆ ప్రాంతంలో అంతవరకూ అవరోధం కల్పిస్తున్న ఆత్మలు ఎలాంటి చర్యకు పూనుకోలేదు. పైగా చర్చి ప్రాంతం అంతా కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ భక్తులు సేదదీర్చుకోడానికి వీలుగా నీడనిచ్చే చెట్లు, సువాసనలు వెదజల్లే పూలమొక్కలు మొదలగునవి ఆత్మలే ఆ ప్రాంతంలో ఏర్పాటుచేశాయి. నేటికీ చీకటి రాత్రులలో ఆత్మలు ఈ చర్చిలో ప్రవేశించి బిగ్గరగా దైవప్రార్థన చేస్తూ గంటలు మోగిస్తూ ఏసు ప్రభువు పట్ల తన భక్తిప్రపత్తులను చాటుకుంటూ తమ కోర్కెలను తీర్చుకుంటున్నాయి. అటు తరువాత ఆ చర్చి ఫాదర్ ఆత్మలను నిరోధించడానికిగాని, అవమానించడానికిగాని ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పరిశోధనల పేరుతో తరచూ ఎవరో ఒకరు రావడం ఈ సంఘటనలు చూసి ఆశ్చర్యచకితులై తిరిగివెళ్ళడం జరుగుతూనే ఉంది. ○